క్లుప్తంగా

ధారమఠం శివుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ధారమఠం శివుడు

గొలుగొండ: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం భక్తులు ధారమఠం మహా శివుడిని దర్శించుకున్నారు. జలపాతాల వద్ద స్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అలాగే కుటుంబ సమేతంగా వచ్చిన వారు అక్కడే వంటా వార్పు చేసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ, పోలీస్ సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేశారు.

కాలీఫ్లవర్ సాగుపై రైతుల ఆసక్తి


ములగపూడిలో సాగు చేస్తున్న కాలీఫ్లవర్

నాతవరం: మండలంలో ములగపూడి, బెన్నవరం, మాధవనగరం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల సాయంతో కాలీఫ్లవర్‌ను విస్తారంగా సాగు చేస్తున్నారు. మండలానికి సరిహద్దు గ్రామాలైన నర్సీపట్నంలోని మెట్టపాలెం, కసిరెడ్డిపాలెం, అప్పన్నపాలెం గ్రామాల్లో కాయకూరలతో పాటు కాలీఫ్లవర్ పంట సాగు చేస్తున్నారు. ఒక ఎకరంలో వేసిన కాలీఫ్లవర్ పంట ద్వారా ఏడాదికి రూ. లక్ష వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ పంట సాగుకు రైతులకు కేవలం రూ. 20 నుంచి రూ. 30 వేలు ఖర్చు అవుతుంది. ఈ ఏడాది ఆయా గ్రామాల్లో 30 ఎకరాలకు పైగా కాలీఫ్లవర్ పంట సాగు చేస్తున్నారు.

తెనుగుపూడిలో మంచినీటి బోరు పనులకు శ్రీకారం


తెనుగుపూడిలో బోర్ల తవ్వకానికి భూమి పూజ చేస్తున్న పెదనాయుడు

దేవరాపల్లి : తెనుగుపూడిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని స్థానిక ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాటిపాం పెదనాయుడు అన్నారు. ఈ మేరకు తెనుగుపూడిలో ఎంపీ నిధులతో మంజూరు చేసిన రెండు మంచినీటి బోర్ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. సలాది వారి వీధి, దాసరి వారి కల్లాల్లో ఈ రెండు బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా జల్‌జీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికి కుళాయి నీరు సరఫరా చేయనున్నట్లు ఉప సర్పంచ్ పెదనాయుడు స్పష్టం చేశారు. దాసరి గోవిందరావు, సలాది రమణ, కిల్లాన శ్రీను, యాళ్ల దేముడుబాబు, సలాది పెదకొండలరావు, వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు మండల పరిషత్ మీటింగ్ హాల్లో జరిగే ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హాజరవుతాని, అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గౌరవ సభ్యులు, ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

'50 ఏళ్లకే పింఛన్ ఇస్తాం'

గొలుగొండ : నర్సింగబిల్లి గ్రామంలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ 50 ఏళ్లకే పింఛన్ అందించే విధంగా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిగర్ల అప్పలనాయుడు, గోపీ, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో.. సాగుకు సంపూర్ణ మేలు

● మండల ఉద్యానవన శాఖాధికారి భాను పుష్పలీలావతి


పూతకొచ్చిన జీడిమామిడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యావన శాఖాధికారి పుష్పలీలావతి

మాడుగుల రూరల్ : ఈ ఏడాది మామిడి పూత ఆలస్యంగా వచ్చిందని మండల ఉద్యానవన శాఖాధికారి వి. భాను పుష్ప లీలావతి పేర్కొన్నారు. ఆదివారం ఆమె కె.జె.పురంలో సాక్షితో మాట్లాడారు. మామిడి, జీడిమామిడి తోటలకు వచ్చే చీడ పీడలు, నివారణ చర్యల గురించి మాట్లాడారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల మామిడి పూత ఆలస్యం అయిందని, ఇటీవల వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో మామిడి, జీడి మామిడి రైతులు కలవరం చెందుతున్నారన్నారు. పొగమంచు కురవడంతో పూత, పిందె ఇప్పటికే రాలిపోయినట్లు తెలిపారు. దీనికి అడ్డుకట్ట వేయాలంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామిడి రైతులకు సూచించారు.

జీడితోటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు..

జీడి మామిడి కాండానికి వేరు తొలుచు పురుగు ఆశించినట్లయితే మొదలు నుంచి బంక కారుతుందన్నారు. అలా జరిగితే బంక కారే ప్రదేశంలో చెట్టు బెరడును తొలగించినప్పుడు అక్కడ చిన్న రంధ్రాలు కనిపిస్తాయన్నారు. ఆ రంధ్రాల్లో సన్నని ఇనుప చువ్వ గుచ్చితే రంధ్రాల నుంచి తెల్లని చిన్న పురుగులు బయటికి వస్తాయని తెలిపారు. పాత గుడ్డలను కిరోసిన్‌లో ముంచి ఆ రంధ్రాల్లో చొప్పించి మంట పెడితే కాండం తొలుచు పురుగు గుడ్లు పిల్ల దశలోనే మాడిపోతాయన్నారు. తర్వాత రంధ్రాల్లో 50 గ్రాముల కార్బోఫురాన్ గుళికలు వేసి పైన మట్టి ముద్దతో కప్పాలన్నారు. దాంతో లోపలున్న పిల్ల పురుగులు నిర్మూలించబడతాయన్నారు. అలాగే చెట్టు కాండం మొదలు 3 అడుగుల ఎత్తు వరకు, భూమిపై కనబడే వేర్లు బాగా తడిసేలా లీటరు నీటికి 50 మిల్లీలీటర్లు చొప్పున్న వేపనూనె కలిపి 4 మాసాలకొక పర్యాయం ఏడాదిలో మూడుసార్లు పిచికారీ చేయాలన్నారు. వేపనూనె నీటిలో కరగదని, ప్రతి లీటరు నీటికి 0.5 గ్రాముల సర్ఫ్ పొడి వేసి బాగా కలియబెట్టాలన్నారు. కీటకాలు ఆశించినప్పుడు చనిపోయిన చెట్లను వేళ్లతో సహా పెకిలించి లోపల దాగి వున్న లార్వాలను నాశనం చేయాలన్నారు. చనిపోయిన చెట్లను ఎండు కొమ్మలు, గడ్డి, ఆకులు వేసి కాల్చివేయాలన్నారు. ఈ విధంగా సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా వేరు, కాండాలకు ఆశించే కీటకాలను అరికట్టవచ్చన్నారు.

తేయాకు దోమ (టీ దోమ) నివారణ చర్యలు..

తేయాకు దోమ, ఇతర ఆకు, కాయలను తినే పురుగులను నివారించేందుకు మూడు పర్యాయాలు సస్యరక్షణ మందులు పిచికారీ చేయాలన్నారు. తొలి పర్యాయం డిసెంబర్ మొదటి పక్షంలో కొత్త చిగురు వచ్చే సమయంలో మోనోక్రోటోపాస్ మందును ఒక లీటరు నీటిలో 1.6 మిల్లీలీటర్ల మందు కలిపి పిచికారీ చేయాలన్నారు. రెండవ పర్యాయం జనవరి రెండవ పక్షం నుంచి, ఫిబ్రవరి మొదటి పక్షంలో పూత బయటికి వచ్చే సమయంలో లామ్డా సైహాలోథ్రిన్ మందును లీటరు నీటిలో 0.6 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. మూడవ పర్యాయానికి సంబంధించి ఫిబ్రవరి రెండవ పక్షం నుంచి మార్చి రెండవ పక్షంలో బఠాణీ గింజ సైజ్‌లో వున్నప్పుడు ప్రొఫెనోఫాస్ మందును ఒక లీటరు నీటిలో ఒక మిల్లీలీటరు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఒక ఎకరా జీడిమామిడి తోటలో పిచికారీ చేయడానికి 200 లీటర్ల డ్రమ్ములో ఆరలీటరు క్లోరిపైరిపాస్ లేదా మోనోక్రోటోపాస్ లేదా లామ్డసైహాలోత్రిన్ లేదా ప్రొఫినోఫాస్, అరకిలో కార్బండిజం మందులో అరకిలో సర్ఫ్ పొడి కలపాలన్నారు. దీంతో పిచికారీ చేసిన మందు ద్రావణం ఆకులకు పట్టి ఉంటుందన్నారు. ఈ విధంగా చేయడం వల్ల పూత రాలడం నివారింపబడి జీడి గింజల పరిమాణం పెరిగేలా చేస్తుందని భాను పుష్పలీలావతి పేర్కొన్నారు.

మామిడి తోటలో సస్యరక్షణ చర్యలు..

మామిడి తోటల్లో ఆకులపై రసం పీల్చే పురుగుల నివారణకు ప్రోఫెనోఫాస్ మందు రెండు మిల్లీలీటర్లు లేదా డైమిథోయేట్ రెండు మిల్లీలీటర్ల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మామిడి తోటల్లో చెట్ల ఆకులు ముడుచుకుంటే పైన పేర్కొన్న సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మామిడి వేసి పది సంవత్సరాలు అయినట్లయితే ప్రతి మొక్కకు ఎరువులు వేసుకోవాలన్నారు. యూరియా 2,175 కిలోలు, 6.25 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 1.67 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను ప్రతి మొక్కకు వెయ్యడం వల్ల మొక్క పెరిగి కాయలు ఏపుగా పెరుగుతాయన్నారు.

ఘనంగా పోతురాజుబాబు పండగ


పోతురాజుబాబుకి పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట : పోతురాజుబాబు పండగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ పండగను స్వర్గీయ మద్దు ఎర్రోడు, చేపలచ్చయ్య, మద్దు వల్లయ్య కుటంబీకులు ఏటా నిర్వహింటారు. ఈ ఏడాది కూడా శనివారం రాత్రంతా జాగారం చేశారు. ఆదివారం వేకువ జాము నుంచి సాయంత్రం వరకూ భక్తులు అధిక సంఖ్యలో గుడికి వచ్చి పోతురాజుబాబుని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం గుడి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు తల నీలాలకు వేలం పాట

బుచ్చెయ్యపేట : ప్రసిద్ధి చెందిన వడ్డాది శ్రీ వేంకటేశ్వరస్వామి తలనీలాలకు సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో శర్మ తెలిపారు. మార్చి 1 నుండి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 28 వరకు ఏడాది పాటు స్వామి వారికి వచ్చే తల నీలాలు తీసుకునేందుకు వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది కన్న తక్కువకు వేలం పాట ఉండటంతో రెండోవసారి వేలంపాటను 11వ తేదీ ఉదయం 11 గంటలకు వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్నామన్నారు.

కెనాల్లో నాచు, మొక్కల తొలగింపు


ఉగ్గినవలస మార్గంలో చురుగ్గా జరుగుతున్న నాచు, మొక్కల తొలగింపు పనులు

కె.కోటపాడు : రైవాడ కెనాల్ మార్గంలో నాచు, మొక్కలను తొలగించే పనులను జీవీఎంసీకి చెందిన లష్కర్లు చురుగ్గా నిర్వహించారు. ఉగ్గినవలస-కృష్ణరాయుడిపేట కెనాల్ మార్గంలో ఆదివారం ఈ పనులు చేపట్టారు. ఈ రెండు ప్రాంతాల మధ్య గల కెనాల్ మార్గంలో నాచు, మొక్కలు నీటి అడుగు భాగంలో పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో ప్రవాహ వేగం మందగించింది. ప్రతి రోజూ విశాఖపట్నం జీవీఎంసీకి వెళ్లాల్సిన 50 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అంతరాయం కలగకుండా ఉండేందుకు నాచు, మొక్కలను తొలగించే పనులు చేపట్టినట్టు జీవీఎంసీ అధికారులు తెలిపారు.

రేపు మోదమాంబ తీర్థం


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు

మాడుగుల రూరల్ : మండలంలోని వీరవల్లి అగ్రహారంలో ఈ నెల 12న మోదమాంబ తీర్థం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను ఆదివారం జె.డి.పేటలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాస్థాయి ఎడ్ల పందాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, గ్రామ సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గుణమ్మ హరికృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టరు సయ్యపురెడ్డి నారాయణరావు, స్కూలు కమిటీ మాజీ చైర్మన్ బోగాది జోగారావు, దొండా చిన వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


సరుగుడులో బోరు ఏర్పాటు చేయిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం: వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో బోర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలో ఆదివారం సరుగుడులో కొబ్బరికాయ కొట్టి బోర్ పనులు ప్రారంభించారు. రూ. 30 లక్షలతో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంత వరకు మండలవ్యాప్తంగా కొండదర్మవరం, గన్నవరం, పార్వతీపురం, ఎ.శరభవరం, ఎంబీపట్నం, రాజుపేట అగ్రహారం, ఉప్పరగూడెం మన్యపురట్ల, ములగపూడి తదితర గ్రామాల్లో బోర్లు వేశామన్నారు. మండలవ్యాప్తంగా 430కి పైగా బోర్లు ఉన్నాయన్నారు. అవి మరమ్మతులకు గురైతే బాగు చేసేందుకు ఎంపీడీవో కార్యాలయంలో తగిన మెటీరియల్ సిద్ధంగా ఉంచామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సిబ్బంది నాయుడు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముద్రగడకు కాపు సంఘం నాయకుల సంఘీభావం


ముద్రగడతో బుచ్చెయ్యపేట మండల నాయకులు

బుచ్చెయ్యపేట : కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను బుచ్చెయ్యపేట మండల కాపు సంఘం నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. మండల నాయకులు శిరిగిరిశెట్టి దొరపిల్ల, సాయం రమేష్, ఎస్. మహేంద్రకుమార్ తదితరులు ఆదివారం కిర్లంపూడిలోని ముద్రగడ ఇంటికెళ్లి ఆయనను కలుసుకున్నారు. 14వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ముద్రగడ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేశామని, భారీగా కార్లు, బస్సుల్లో తరలి వెళ్లి పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు మండల నాయకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయం కాంక్షిస్తూ ర్యాలీ


కొణతాల వరలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ

నర్సీపట్నం : వైఎస్సార్‌సీపీ గెలుపును కాంక్షిస్తూ నర్సీపట్నం మున్సిపాలిటీ 27వ వార్డు శివపురం పార్టీ ఇన్‌చార్జి కొణతాల వరలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. శివపురం అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మళ్లీ గణేషన్న గెలవాలి.. మన జగనన్న రావాలి అంటూ నినదించారు. ఈ ర్యాలీని టౌన్ పార్టీ అధ్యక్షుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ఇన్‌చార్జి వరలక్ష్మి ఇటువంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం వరలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఆడాకుమారి, పల్లా సత్యవతి, చిటికెల రమణమ్మ, ఏకా సత్తిబాబు, నడిగట్ల శ్రీనివాసరావు, కోయిలాడ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధిత చిన్నారులకు దాతల ఆర్థిక సాయం


అవినాష్ కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న విలేజీ రీకన్‌స్ట్రక్షన్ సొసైటీ సభ్యులు


పావనికి ఆర్థిక సాయం చేస్తున్న బుచ్చింపేట వార్డు కార్యదర్శి రమణ

రోలుగుంట : మండలం బల్లిపాలెం గ్రామానికి చెందిన బలిజి అవినాష్ (5) గోడపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతని వైద్యం కోసం విలేజీ రీకన్‌స్ట్రక్షన్ సొసైటీ ప్రతినిధులు ఆదివారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. అవినాష్ ఆడుకుంటూ గత నెల 21న గోడపై నుంచి పడిన ప్రమాదంలో తలకి దెబ్బ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతని తండ్రి నరేష్ విశాఖలోని ఓ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. దీనికి రూ. 13 లక్షలు ఖర్చు అయింది. ఇతనిది పేద కుటుంబం కావడంతో విలేజీ రీకన్‌స్ట్రక్షన్ సొసైటీ సభ్యులు మలసాల గణేష్, చండక నాగేశ్వరావు, కాప్స్‌రాక్స్‌కోర్ అడ్మిన్ పరవాడ నర్సింహమూర్తి తదితరులు సాయమందించారు.

చిన్నారి పావనికి..

రోలుగుంట : ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న రత్నంపేట గ్రామానికి చెందిన నాలుగు సంవత్సరాల చిన్నారి పావనికి బుచ్చింపేట గ్రామానికి చెందిన వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ ఆదివారం రూ. 5 వేలు ఆర్థిక సాయమందించారు. పేద కుటుంబానికి చెందిన విరోధుల నారాయణరావు కుమార్తె పావనికి ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆమె కుటుంబానికి గ్రామ యువత కూడా కొంత ఆర్థిక సాయం చేశారు. చిన్నారి పావని తండ్రి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

120 మంది యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

ఎస్.రాయవరం: మానవ సేవే మాధవ సేవగా తలచి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు శానాపతి బాబూరావు తెలిపారు. తన కుమార్తె కుసుమకావ్య జ్ఞాపకార్థంగా కుసుమ కావ్య ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం అడ్డురోడ్డులో పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మంది యువకులు రక్తదానం చేశారు. ఇదే క్రమంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు సహాయ సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానికులు సహాయ సహకారాలు అందించారు.

ప్రమాదకరంగా కందిగెడ్డ వంతెన


రక్షణ గోడలు లేని కందిగెడ్డ వంతెన

కె.కోటపాడు : మండలంలో గవరపాలెం-కె.జె.పురం గ్రామాల మధ్య గల కందిగెడ్డ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన నిర్మాణం జరిగి సుమారు 24 ఏళ్లు కావస్తున్నా నేటికీ దీనికి రక్షణ గోడలు నిర్మించలేదు. ఈ వంతెన గుండానే కె.కోటపాడు మండల గ్రామాల్లో గల ప్రజలు విజయనగరం, కొత్తవలస ప్రాంతాలకు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన మలుపు వద్ద ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు గుర్తించడం వీలు కాక ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు వంతెనకు రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

భగవద్గీత శ్లోకాలపై శిక్షణ

మునగపాక: తోటాడలో ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమంలో భగవద్గీత శ్లోకాల శిక్షణ కార్యక్రమం నిర్విరామంగా సాగుతోంది. ఓంకార పీఠం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఈ శిక్షణకు పిల్లలు, పెద్దలు హాజరవుతున్నారు. భగవద్గీత శ్లోకాలపై తమకు అందిస్తున్న శిక్షణ అన్ని విధాలా దోహదపడుతుందని శిక్షకులు శ్రీనివాసరావు, లలిత తదితరులు తెలిపారు.

వైభవంగా 'నమామి సాయి శత రుద్రీయం'


వేచలంలో ప్రత్యేక పూజలందుకుంటున్న సత్యసాయిబాబా

దేవరాపల్లి : మండలంలోని వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భగవాన్ సత్యసాయి బాబా 100వ జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 75వ ×నమామి సాయి శత రుద్రీయం॰ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పరవశించిపోయారు. ముందుగా సత్యసాయి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణంరాజు, వేద అధ్యయన విభాగానికి చెందిన కొఠారు హరి ప్రసాద్ శర్మ, కన్వీనర్ నొడు అప్పారావు, స్టేట్ యూత్ కోఆర్డినేటర్ కళ్యాణ్, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త కశిరెడ్డి అప్పలనాయుడు, జిల్లా యూత్ కోఆర్డినేటర్ తాతాజీ, జాయింట్ కోఆర్డినేటర్ శివకుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ రాజశేఖర్, ఐటి కోఆర్డినేటర్ అశోక్‌వర్మ, స్థానిక గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, భారతి, రమణమ్మ, కన్నబాబు, సూర్యం, లలితాప్రసాద్, వెంకటపతి, రవిశంకర్ తదితర సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

సచివాలయాల ప్రారంభం నేడు



బుదిరెడ్లపాలెంలో కొత్తగా నిర్మించిన సచివాలయం


నూతనంగా నిర్మించిన పొట్టిదొరపాలెం సచివాలయం

బుచ్చెయ్యపేట : మండలంలో గల రెండు గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాలకు సోమవారం ప్రారంభోత్సవం జరగనుంది. కొమళ్లపూడి శివారు బుదిరెడ్లపాలెంలో రూ. 40 లక్షలతో, పొట్టిదొరపాలెంలో రూ. 25 లక్షలతో కొత్తగా గ్రామ సచివాలయ భవనాలు నిర్మించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి సమక్షంలో సచివాలయ భవనాలను సోమవారం ఉదయం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాలకు ఆయా గ్రామాల నాయకులు హాజరవ్వాలని అధికారులు కోరారు.

సీఎం జగన్ సుపరిపాలన గురించి ప్రజలకు చెప్పండి


చింతపాకలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట : వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, పార్టీ మండల ఇన్‌చార్జి గేదెల శేషు తెలిపారు. ఆదివారం చింతపాక, గున్నెంపూడి, తురకలపూడి గ్రామాల్లో నేను సిద్ధం.. నా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికలు సమీపించడంతో ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. టీడీపీ పాలనలో రుణాలు మాఫీ చేయకుండా రైతులు, మహిళల్ని మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి, ఇంటికొక ఉద్యోగం, బాబు వస్తే జాబ్ వస్తుందని యువకుల్ని చంద్రబాబునాయుడు ఎలా మోసం చేశారో ప్రజలకు అర్థమయ్యేలా వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, సర్పంచ్‌లు గొలజాన శ్రీను, ముచ్చకర్ల హరిణి అప్పారావు, గోవింద, అప్పలనాయుడు, నాగేశ్వరరావు, వజ్రపు బాబూరావు, జగన్, సంజీవరావు, చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి పాటుపడాలి

మునగపాక: దళితుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక బీసీ కాలనీలో పూర్వపు హాస్టల్ ప్రాంగణంలో ఆదివారం మండల స్థాయి దళితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. దళితవాడలను పంచాయతీలుగా గుర్తించాలన్నారు. వీటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఎన్నికలు సమీపించే వేళ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని మే నెలలో నిర్వహించేలా నిర్ణయించామన్నారు. సమావేశంలో దళిత నేతలు కోనపల్లి రామ్మోహనరావు, పిల్లి అప్పారావు, గుంట్ల అప్పారావు, పోతురాజు, దిమ్మల శివ తదితరులు పాల్గొన్నారు.